www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023
5
వైఎస్ఆర్

ఆటో యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

పోరుమామిళ్ల టౌన్ : సిఐటియు ఆధ్వర్యంలో నూతనంగా ఆటో యూనియన్ ఏర్పాటు చేశామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆటో వర్కర్ల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 500 ఆటోలు ఉన్నట్లు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం యూనియన్ ఏర్పాటు ఎంతైనా అవసరం ఉందని చెప్పారు. వారి సంక్షేమం కోసం ఆటో యూనియన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సాధారణ పౌరుడికీ ఆటో వర్కర్ అవసరమవుతుందని, శ్రామికులు సంఘటితం అవ్వాలని అన్నారు. ఆటోనగర్ ఏర్పాటు, ఆటో వర్కర్లకు ఇళ్ల స్థలాలు అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా దానం, చిన్నప్ప, విజయ భాస్కర్, ప్రసాద్, రమణ, గాబ్రియేలు, మధు, సహాయ కార్యదర్శులుగా జాలా గంగయ్య, కమిటీ సభ్యులుగా రాజేష్ కుమార్, పుష్పరాజ్, చిన్న, భాస్కర్, శ్యామ్ ఎన్నికయ్యారు.

'ఉక్కు' పనులు
వేగవంతం చేస్తాం

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు
పులివెందుల దేశానికే ఆదర్శం
గండికోటలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ
ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

హాకీ ఆడుతున్న సిఎం జగన్

విల్లు ఎక్కుపెట్టిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

జమ్మలమడుగులో ఒబెరాయ్ హోటల్ నిర్మాణ భూమి పూజలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందులలో మున్సిపల్ కార్యాలయ భవన్ని ప్రారంభిస్తున్న సిఎం

ప్రజాశక్తి-జమ్మలమడుగురూరల్/పులివెందుల టౌన్/రూరల్

ఉక్కు పరిశ్రమ పనులను మరింత వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం జమ్మలమడుగు పులివెందులలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జమ్మలమడుగు మండలంలోని గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సిఎం ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్‌సింగ్ ఒబెరాయ్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం గండికోటతో పాటు తిరుపతి, విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం అన్నవరంలో కూడా ఒబెరాయ్ (గ్రూపు సంస్థ) నిర్మించే 7 స్టార్ సౌకర్యాల గల లగ్జరీ రిసార్ట్ నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాదిలోనే ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు ఈ నెల 15 తర్వాత ఉక్కు పరిశ్రమకు పర్యావరణ అనుమతులు రానున్నాయన్నారు. ఆ తర్వాత పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. ఉక్కు పరిశ్రమ, ఒబెరాయ్ వంటివి జిల్లా రావడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. గండికోటలో ఒబెరాయ్ ఇలాంటి రిసార్ట్స్‌తో పాటు మరో రిసార్ట్స్ కోసం పరిశీలన చేస్తున్నామని తెలిపారు. త్వరలో గండికోటలో మరో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కడప నగర సమీపంలోని కొప్పర్తిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అక్కడ కూడా మరో రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం దక్కుతుందన్నారు. ఉద్యోగాల విషయంలో స్థానికులు ఇబ్బంది పడవద్దని కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు తొలగిపోతాయని సభాముఖంగా తన ప్రతినిధులకు తెలిపారు. కడప జిల్లాకు ఇంకా మంచి చేయాల్సిన అవసరం, మంచి జరిగే రోజులు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మెరుగ్గా చేసే పరిస్థితులు, అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పారిశ్రామిక వేత్తలకు మనం ఎంత సహకారం అందిస్తే జిల్లా ప్రతిష్ట పెరుగుతుందన్నారు. ఎక్కువ పరిశ్రమలు జిల్లాకు వచ్చి పారిశ్రామిక వేత్తలు పెట్టుబడి పెడతారని తెలిపారు. ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, టూరిజం డెవల్మెంట్ కార్పొరేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రసంగించారు.

కౌన్సిలర్లతో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎపిఐడిసి చైర్మన్ వరప్రసాద్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, ఒబెరాయ్ గ్రూప్ ప్రెసిడెంట్ శంకర్, కడప మేయర్ సురేష్ బాబు, గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, వివిధ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

రూ.142.37 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణాన్ని దేశానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.3.25 కోట్లతో నిర్మించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ప్రారంభించారు. రూ.16.18 కోట్లతో అభివృద్ధి చేసిన పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణి తోపు), రూ.39.00 కోట్లతో అభివృద్ధి చేసిన గరండాల రివర్ ఫ్రంట్ (ఫేస్-1) గార్డెన్, రూ.32.82 కోట్లతో ఆధునాతన వసతులతో 8 ఎకరాల్లో నిర్మించిన వైఎస్ఆర్ ఐఎస్‌టిఏ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీకి, రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన బెక్ బయో సైన్సెస్, రూ.26.12 కోట్లతో 12.86 ఎకరాల్లో 12 రకాల క్రీడాంశాలకు సంబంధించిన వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీని సిఎం ప్రారంభించారు. జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, సిఎం వ్యక్తిగత కార్యదర్శి దినయదుల్లా, ఒఎస్‌డి కృష్ణమోహన్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయకుమార్, నూ టెక్ ఎండి ప్రతాప్‌రెడ్డి, ఏపీ కార్ల్ సీఈవో రమణా రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకపోతే
మరో ఉద్యమం తప్పదు
ఫ్యాప్టో రాష్ట్ర నాయకుల హెచ్చరిక

సంఘీభావం తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదని ఏపీటీఎఫ్(257) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యామ్ సుందర్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, ఎస్టీయూ రాష్ట్ర ఆదనపు ప్రధాన కార్యదర్శి కె.బాలగంగిరెడ్డి హెచ్చరించారు. ఆది వారం యుటిఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుని హోదాలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటిని నమ్మి అధికారంలోకి రావడానికి సహకరిస్తే, పూర్తిగా విస్మరించారని వాపోయారు. . నాలుగేళ్ల పరిపాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పారన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలతోపాటు, ఏడు డిఎ బకాయిలను కూడా చెల్లించలేదని ఆరోపించారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను, విద్యాశాఖాధికారులను భయభ్రాంతులను చేయడం తగదన్నారు. ముఖ్య కార్యదర్శి దూకుడును ప్రభుత్వం నిలువరించాలని వారు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 117 ను జారీ చేసి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. పాఠశాల విలీనం పేరుతో ప్రాథమిక విద్యను ధ్వంసం చేశారని ఆరోపించారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 5400 ప్రాథమిక పాఠశాలను విలీనం చేశారన్నారు. జీవోను అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 వేల పాఠశాలలలో 20వేల పాఠశాలను డీగ్రేడ్ చేయడం కానీ మూసి వేయడం కానీ చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ ప్రాథమిక విద్యకు సమాధి కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. జూలై 2023 నుండి అమలు చేయాల్సిన 12వ పిఆర్‌సితక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.అబ్దుల్లా, యుటిఎఫ్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, ఎస్.జాబీర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, ట్రెజరర్ రాజశేఖర్, ఏపీటీఎఫ్(257) జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.భాస్కర్ రెడ్డి, నాగ రాజు, బిటిఏ జిల్లా అధ్యక్షులు హరి కొండయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీల 36 గంటల ధర్నాను జయప్రదం చేయండి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపు

సమావేశంలో మాట్లాడతున్న మనోహర్

ప్రజాశక్తి కడప అర్బన్

అంగన్వాడీ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద నిర్వహించే 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చినటువంటి హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. తెలంగాణ కన్నా ఒక వెయ్యి రూపాయలు అంగన్వాడీలకు పెంచుతానని హామీ ఇచ్చారని చెప్పారు. తెలంగాణ కన్నా రెండు వేల రూపాయలు తక్కువ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం, కనీసం రూ.26 వేల వేతనం, గ్రాటిటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 400 జనాభా దాటిన మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా మార్చాలి అన్నారు. అంగన్వాడీలందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. ఆయాలకు ప్రమోషన్ల కోసం వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచాలని కోరారు. అర్హులైన అంగన్వాడీ లందరికీ సూపర్‌వైజర్లగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై రేపు జరగబోయే ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా ట్రెజరర్ అంజలీదేవి పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు 'మల్లికార్జునుడు'
మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ప్రముఖులు

ప్రజాశక్తి కడప అర్బన్

కవిగా, రచయితగా, నటుడుగా, నాటక కర్తగా, దర్శకుడుగా, నాటక ప్రయోక్తగా, ఉత్తమ ఆచార్యులుగా బహుముఖీన సేవలందించిన ప్రజావంతుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అని మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. లలిత కళానికేతన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అభినందన సంచిక 'మల్లికార్జునీయం' పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మైదుకూరు శాసనసభ్యులు వేదికపై ఉన్న అతిథులతో కలసి ముందుగా 'మల్లికార్జునీయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి సాహితీవేత్తగా, ఉత్తమ ఆచార్యులుగా సేవలందించి మైదుకూరు నియోజకవర్గానికి గర్వకారణమయ్యారన్నారు. వ్యక్తిగా ఎంతోమందికి సన్నిహితంగా మెలగుతూ జిల్లాలోనే సాంస్కృతిక సారథిగా కొనసాగుతున్నారన్నారు. బ్రౌన్ గ్రంథాలయానికి పాఠకుడుగా తన ప్రస్థానాన్ని కొనసాగించిన మల్లికార్జున రెడ్డి సాహితీవేత్తల సాంగత్యంతో రచయితగా ఎదిగి తిరిగి అదే గ్రంథాలయానికి సంచాలకులుగా సేవలందించడం, గ్రంథాలయ ప్రగతికి కృషి చేయడం హర్షణీయమన్నారు. ఆత్మీయ అతిథి, కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి తమ సంస్థ తరపున ఏ కార్యక్రమం నిర్వహించినా కార్యక్రమ రూపకల్పనతోపాటు నిర్వహణ బాధ్యతలను కూడా చేపట్టేవారని, బ్రౌన్ గ్రంథాలయంలో జరిగే సాహిత్య కార్యక్రమాలకు తనకు తప్పక ఆహ్వానం అందించేవారన్నారు. మల్లికార్జున రెడ్డి బాధ్యులుగా ఉన్నప్పుడు తన వద్ద ఉన్న అనేక పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించానన్నారు. పుస్తక సమీక్షకులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి జీవితం తెరచిన పుస్తకమని, ఆయన జీవిత ప్రస్థానం ఎంతోమందికి ఆదర్శప్రాయమన్నారు. ఆ తర్వాత వేదికపై ఉన్న అతిథులను, మల్లికార్జునీయం పుస్తక సంపాదకవర్గ మిత్రులను, పుస్తక ముద్రణకు ఆర్థికంగా సహకరించినవారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య మల్లి కార్జున రెడ్డిని మిత్రులు, బంధువులు, ఆత్మీయులు ఘనంగా సత్కరించారు. ఆకాశవాణి క్యాజువల్ అనౌన్సర్ భూమిరెడ్డి స్వరూపరాణి సభా నిర్వహణ చేశారు. నిర్వాహకులుగా మూల ఈశ్వరరెడ్డి, మూల శివప్రసాద్ రెడ్డి, మూల దేవ మునిరెడ్డి వ్యవహరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని కొత్త గాంధీ నగర్‌లో ఆది డేవిడ్ మృతిచెందారు. కొత్తగాంధీ నగర్‌లోని సచివాలయం-3 కన్వీనర్ నాగలర్పు బాబు ఈ విషయం వైసిపి అధికార ప్రతి నిధి గుమ్మా రాజేంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎమ్మెల్యే పోచెంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ కింద అంత్యక్రియలకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పోస్టులు భర్తీ చేయాలని అడగడం నేరమా? : డివైఎఫ్ఐ

ఓబులేసుకు నోటీసు అందిస్తున్న ఎఎస్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయమని అడగడమే నేరమా జగనన్న అని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు ప్రశ్నించారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో రెండు రోజుల నుంచి నోటీసు తీసుకోవాలని ఫోన్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలోని కడప ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపనలకే పరిమితమైందని చెప్పారు. ప్రతి సంవత్సరమూ మెగా డిఎస్‌సి ద్వారా 50 వేలు ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చేస్తామన్న మాట నీటి బుడగలాగే మిగి లిందని వాపోయారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుళ్లు ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా కలిసే అవకాశం కూడా లేకుండా పోలీసుల ఉక్కు పాదం మోపి అక్రమంగా నోటీసులు, అరెస్టులకు బరితెగించ డం దారుణమని వాపోయారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వాటి సాధన కోసం నిర్బంధాలను సైతం ఎదుర్కొంటామని హెచ్చరించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

కడప : ప్రజాస్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖూనీ చేస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయమని, ఎస్సై కానిస్టేబుల్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ మెయిన్స్ పరీక్షలు అడగడమే నేరమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప పర్యటన నేపథ్యంలో సమస్యలు వినకుండా నిర్బంధాలు అరెస్టులతో రెండు రోజుల నుంచి నోటీసులు తీసుకోవాలని ఫోన్ చేస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణమే తమ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వాటి సాధన కోసం నిర్బంధాలను సైతం ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు.

సమస్యలపై ప్రతి ఒక్కరూ స్పందించాలి

కడప : గణిత ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతి ఒక్కరూ స్పందించాలని ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అట్లా నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం కడప నగరంలో నిర్వహించారు. ఇందులో గణిత ఉపాధ్యాయుల సమస్యలపై కూలంకషంగా చర్చించి అధికారులకు ప్రాతినిధ్యం చేయాలని నిర్ణయించారు. విద్యార్థులకు గణితం సులభరీతిలో అర్థమయ్యే విధంగా బోధించుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం వైసిపి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు స్టేట్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కోనా కిరణ్ కుమార్‌రెడ్డి, పి.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా ఎం.సునీల్ కుమార్, అధ్యక్షులుగా ఎల్.సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.వి. మహేశ్వర్ రెడ్డి, కోశాధికారిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా వి. నాగరాజు, బి. శ్రీనివాసులు, కార్యనిర్వహక కార్యదర్శిగా షేక్ నూరుల్లా, అదనపు కార్యదర్శిగా ఏ శ్రీనివాసులు, ఎం పుల్లారెడ్డి, డి.రామాంజనేయరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జె.సురేష్ బాబు, బి. సురేష్, మనోహరయ్య, డి.పోల్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి. వెంకటసుబ్బారెడ్డి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి 'స్పందన' తాత్కాలికంగా రద్దు

కడప : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 8 నుంచి 10 వరకు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా అధికారులందరు ముఖ్యమంత్రి గారి కార్యక్రమంలో నిమగ్నమై ఉండడంతో.'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వి.విజయ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

భూ కబ్జాలపై సిట్టింగ్ జడ్జిచే విచారించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ప్రభుత్వ భూములేగాక పట్టా భూములు సైతం ఆక్రమిస్తున్న కబ్జాదారులపై (భూ బకాసురులపై) చర్యలు తీసుకునేలా సిట్టింగ్ జడ్జి చేత విచారించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హరి టవర్స్ భూ కబ్జాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ కబ్జాలపై సదస్సు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన సామాన్యులు జానడు ఇంటి స్థలం, రెండు ఎకరాలు సాగు భూమి కోసం అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా సవాలక్ష ప్రశ్నలు వేసే రెవెన్యూ అధికారులు వందల ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జాదారులు ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు పోటీపడి ప్రభుత్వ భూములే కాకుండా వివాదాస్పద పట్టా భూములు సైతం ఆక్రమించి కబ్జాచేసి చివరకు సెటిల్మెంట్‌లో తేడాలు వస్తే హత్యలకు సైతం వెనకాడడం లేదని చెప్పారు. ల్యాండ్ మాఫియా రెచ్చిపోయి వంక,వాగు, రస్తా, చెరువు, దేవాదాయ, ఇనాం, అసైన్డ్ భూములు అన్నింటిని ఆక్రమిస్తే కాపాడాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులే చర్యలు తీసుకోకుండా వారికి కట్టబెట్టేందుకు తహతహలాడుతున్నారని, అలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నాయకులు బి. నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జకరయ్య, అయ్యావారయ్య, బిఎస్‌పి నాయకులు గురప్ప, జనతాదళ్ పార్టీ నాయకులు ప్రతాపరెడ్డి, లోక్ సత్తా పార్టీ నాయకులు దేవర శ్రీకృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సహాయ కార్యదర్శి కెసి.బాదుల్లా, నగర కార్యవర్గ సభ్యులు మనోహర్‌రెడ్డి, రాయలసీమ ఎస్సీ ఎస్టీ ఫోరం నాయకులు జెవి.రమణ, హేతువాద సంఘం నాయకులు సిఆర్‌వి ప్రసాద్, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునయ్య, ఎఐవైఎఫ్ నగర కన్వీనర్ ఎస్.కె. మైనుద్దీన్ పాల్గొన్నారు.

కడప జట్టుపై అనంతపురం విజయం

ప్రజాశక్తి - కడప

అనంతపురానికి చెందిన ప్రశాంత్, జయంత్ కృష్ణ సెంచరీలు చేయడంతో 408 పరుగుల తేడాతో అనంతపురం జట్టు కడప జట్టు పై ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అనంతపురం మొదటి ఇన్నింగ్స్ లో 397 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్ లో 148 పరుగులు చేసింది. 3 వికెట్ల నష్టానికి 320 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు తన రెండవ ఇన్నింగ్స్ లో 81.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 407 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ చెట్టులోని ఏ. జయంత్ కృష్ణ 119 పరుగులు (సెంచరీ), ప్రశాంత్ 141 (సెంచరీ) పరుగులు చేశారు. కడప జట్టులోని సాయి అర్జిత్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 71.0 ఓవర్లలో 248 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. ఆ జట్టులోని విజయ్ రామ్ రెడ్డి 90, సాయి అర్జిత్ రెడ్డి 91 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ఎం.కే. లోహిత్ సాయి కిషోర్ బౌలింగ్లో అద్భుతంగా రాణించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ప్రదీప్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. **డ్రాగా ముగిసిన చిత్తూరు, కర్నూలు మ్యాచ్..** వై. ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్ లో కర్నూలు జట్టు 284 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. చివరి రోజు కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 78.0 ఓవర్లలో 9 వికెట్లను నష్టానికి 361 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

డాక్టర్ సతీష్‌రెడ్డికి అవార్డు

కడప అర్బన్ : ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన ప్రముఖ ఫిజియోథెరపీ డాక్టర్ పుత్తా సతీష్ రెడ్డికి జాతీయ ఉత్తమ ఫిజియోథెరపీ ఎక్సలెన్సీ అవార్డు అందజేశారు. ఆదివారం హైదరాబాద్ ఎంఎన్ఆర్ ఆడిటోరియంలో ఎంఎన్ఆర్ సంజీవిని ఫిజియోథెరపీ కాలేజీ, ఫిజియో ఫౌండషన్ ఇండియా ఆధ్వర్యంలో ది రైస్ ఆఫ్ ఫిజియో ఇంటర్నేషనల్ ఫిజియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సతీష్‌రెడ్డి జాతీయ ఉత్తమ ఫిజియో థెరపీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపీ అసోసియేషన్, వైద్య మిత్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నోటీసులు ఇవ్వడం సమంజసం కాదు

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చొరవ చూపాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని పోలీసులు నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్య హక్కులను భంగం కలిగించే చర్యని అభిప్రాయపడ్డారు. నగరంలో అనేక రకాల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి ముఖ్యమంత్రి కృషి చేయాలని తెలిపారు. రామకృష్ణ నగర్ లో దాదాపు రెండు వేలకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వీరందరికి తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న ప్రజలు రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం లేక ఇప్పటికి వర్షాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి కొనసాగుతోందన్నారు. నగర అభివృద్ధి అంటే కేవలం ప్రధాన రోడ్లకు, పార్కులకు మాత్రమే పరిమితం కాదని, సామాన్య ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు ఓబులేసు పాల్గొన్నారు.

ఎం.వి.శివారెడ్డికి డాక్టరేట్



కడప : కేంబ్రిడ్జ్ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, యుకెకి అనుబంధంగా ఉన్న సెయింట్ మదర్ థెరిస్సా యూనివర్సిటీ ద్వారా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సిఇఒ ఎం.వి శివారెడ్డికి క్రీడల్లో గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎం.వి. శివారెడ్డి మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. డాక్టర్ కావాలనే చిన్ననాటి కల పరోక్షంగా ఇలా నెరవేరిందని అన్నారు. జెబిఆర్ హార్వర్డ్ యుఎస్ఏ ద్వారా గుర్తింపు పొందింది అన్నారు. స్నేహితులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, సోదరుల ఎల్లప్పుడూ తన విజయాన్ని కాంక్షిస్తున్నందున గౌరవం దక్కిందని తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన 'తుంగా'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎర్రగుంట్ల 5వ వార్డు కౌన్సిలర్ తుంగా వెంకట రామిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి మెమో రాండం సమర్పించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు.

సిఎం జగన్‌తో తుంగా వెంకటరామిరెడ్డి

మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయరూ..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మునిసిపల్ మంచినీరు కంపుకొడుతున్నాయని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్యూరిఫైడ్ కూల్‌వాటర్ ప్లాంట్‌ను మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో మునిసిపల్ మస్టర్ పాయింట్, ప్రొద్దుటూరు, కడప, తిరుపతికి వెళ్లే ప్రయాణికులు వేచి ఉంటారు. అలాగే మైలవరం, పెద్దముడియం, పట్టణంలోని వారితోపాటు జమ్మలమడుగు మండలంలోని గ్రామాల వారు నిత్యం తిరుగుతూ దాహం వేసినప్పుడు మంచి నీరు తాగడానికి వెళుతుంటారు. ఒకప్పుడు నీళ్లు బాగుండేవని పేర్కొంటున్నారు. బాటిల్‌లో నీరు పట్టుకున్నాక వాసన వస్తున్నాయి.. అవి పక్కన పారవేసినా బాటిల్ వాసన వస్తోందంటున్నారు. అధికారులు ట్యాంక్‌ను పరిశీలించి, అందులో ఏమైనా పడిందా లేక లోపల అపరిశుభ్రంగా ఉందా చూసి మంచినీరు అందించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

బాటిల్‌లో నీరు పట్టుకుంటున్న వ్యక్తి

మరుగుదొడ్లు సరే.. నీటి సౌకర్యమేదీ..!

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు ఎంతో అవసరం. ప్రజలకు కనీస సదుపాయాలను కల్పించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గ్రామ సచివాలయాల వద్ద ప్రజలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని చెముళ్లపల్లె గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్లు నీటి వసతికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. మోటరు మరమ్మతుకు గురవడంతో మరుగుదొడ్లకు నీటి సదుపాయం నిలిచిపోయింది. కార్యాలయాలకు వచ్చే ప్రజలు మరుగుదొడ్లను వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మోటర్‌కు మరమ్మత్తు చేపడితే సమస్య పరిష్కారం అవుతుందని కొందరు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటర్‌కు మరమ్మత్తులు చేపట్టి మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

జోనల్ కార్యదర్శిగా నంద్యాల రాజశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పట్టణం, రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎస్‌పిఎస్ విటల్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల బిసి ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు అన్ని డిపార్ట్‌మెంట్ల నుంచి హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో రాయలసీమకు సంబంధించి కడప జిల్లాకు సంబంధించి నంద్యాల రాజశేఖర్‌ను జోనల్ ప్రధాన కార్యదర్శిగా, నాగ శేషను, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి.మణిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎం. వరదయ్యను, అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా పి. మహదేవను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. విశిష్ట అతిథులుగా దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, మాజీ మంత్రివర్యులు ఆళ్ల నాని, ఏలూరు జడ్పీ చైర్మన్ పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.
జోనల్ కార్యదర్శి నంద్యాల రాజశేఖర్

క్రికెట్‌లో రాణిస్తే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప

క్రికెట్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సిఇఒ డాక్టర్ ఎం.వి. శివారెడ్డి అన్నారు. ఆదివారం కడపలోని వైఎస్ఆర్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో అండర్ –15, అండర్ –19, సీనియర్స్ మహిళల క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎసిఎ సౌత్ జోన్ అకాడమీ చైర్మన్ పురుషోత్తం రావుతో కలిసి ఎంపికలను ప్రారంభించారు. మూడు ఏజ్ గ్రూపుల మహిళా క్రికెట్ జట్ల ఎంపికలకు ఉమ్మడి జిల్లాల నుండి దాదాపు 75 మంది మహిళా క్రికెటర్లు హాజరయ్యారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్ గా ఎంపిక చేసినట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, డి సి ఓ ఎస్. కాజా మైనుద్దీన్ తెలిపారు. త్వరలో పాప బుల్స్ మ్యాచ్లు నిర్వహించి జిల్లా మహిళా జట్లను ఎంపిక చేస్తామని వారు తెలిపారు.

క్రీడాకారులతో డాక్టర్ ఎంవి శివారెడ్డి, పురుషోత్తం రావు

చెస్ టోర్నమెంట్ విజేత లిఖితేశ్వరరావు

కడప : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని హాల్ ఆఫ్ చెస్ లో నిర్వహించిన అశ్రఫ్ ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ లో విజేతగా రేటెడ్ క్రీడాకారుడు లిఖితేశ్వరరావు నిలిచాడు. ద్వితీయ స్థానంలో రేటెడ్ క్రీడాకారుడు జాఫర్ నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో 34 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్లకు గాను 4.5 పాయింట్లు సాధించిన లికితేశ్వరరావు టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. 4.5 పాయింట్లు సాధించిన జాఫర్ టైం బ్రేక్ స్కోరులో లిఖిత్ కంటే తక్కువ ఉండడంతో రెండవ స్థానం సాధించాడు. విజేతలకు బహుమతులను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి, కోచ్ తపస్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు–కొండాపురం రైలు మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపం వద్ద ఆదివారం ఉదయం రైలు కింద పడి దూదేకుల హుస్సేన్ (45) వ్యక్తి మృతి చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ కెఎస్ వర్మ వివరాల ప్రకారం.. జమ్మలమడుగుకు చెందిన హుస్సేన్ కూరగాయల వ్యాపారి. మద్యానికి బానిసై అప్పుల బాధతో ఇంట్లో గొడవ పడ్డాడు. శనివారం మధ్యాహ్నం కాణిపాకం వెళ్తున్నానని ఇంట్లో నుండి ముద్దనూరు వచ్చాడు. శనివారం రాత్రి మద్యం సేవించాడు. ఆదివారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్యాన్నిచ్చే డ్రాగన్ ఫ్రూట్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇటీవల కాలంలో డ్రాగన్ ఫ్రూట్ పేరు బాగా వినిపిస్తున్నట్లు చెప్పవచ్చు. దీనిలో పోషక విలువలున్నాయని చాలా మంది తినేందుకు డ్రాగన్ ఫ్రూట్స్‌ను ఇష్టపడుతున్నారు. ఈ పండు ఒకప్పుడు నగర ప్రాంతాల పెద్దపెద్ద మాల్స్‌లో మాత్రమే దొరికేది. కానీ ప్రస్తుతం పట్టణాల్లో కూడా ఇవి అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా మరీ ముఖ్యంగా పులివెందుల మండల పరిధిలోని ఈ.కొత్తపల్లి గ్రామంలో పుష్పనాథ్‌రెడ్డి అనే రైతు మూడు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్‌ను సాగు చేశారు. ఇక్కడ వచ్చిన దిగుబడిని రైతు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఫ్రూట్ ఎరుపు, పింక్ రంగులో ఉంటుంది. దీని రుచి తాటి ముంజలా ఉంటుందని పలువురు అంటున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌తో ఐస్ క్రీం, కేకులు, జెల్లీలు, సాలాడ్స్ తయారు చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌ను పలు పేర్లతో పిలుస్తుంటారు. ఈ ఫ్రూట్‌లో శరీరానికి శక్తినిచ్చే ఫైబర్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయని పలువురు చెబుతున్నారు. మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్ మెండుగా ఉంటాయి. విటమిన్ 'సి' అధికంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో బి1, బి2, బి3 విటమిన్లూ ఉంటాయి. తరచూ మన డైట్‌లో డ్రాగన్ ఫ్రూట్ చేర్చుకుంటే అనేక ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పండు తినడం వల్ల చక్కెర వ్యాధి అదుపులో ఉంటుందని అంటున్నారు. ఎన్‌సిబిఐ ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటితోపాటు

ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్, ఫైబర్ మెండుగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతాయి. ఈ పండు ఇన్సులిన్ రెస్టిసెన్స్‌ను పెంచుతుంది. డయాబెటిస్ లేనివారు, డ్రాగన్ ఫ్రూట్ తింటే షుగర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

గుండెకు మేలు..

మనం తరచుగా డ్రాగన్ ఫ్రూట్ తింటే గుండె ఆరోగ్యానికి మేలు. డ్రాగన్ ఫ్రూట్ గుండెను సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్ విత్తనాల్లో ఒమేగా–3, ఒమేగా–9 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. హెచ్‌డీఎల్ గుండె ఆరోగ్యానికి మంచిది.

క్యాన్సర్ రోగులకు చాలా మంచిది..

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటి ట్యూమర్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి మహిళలను రొమ్ము క్యాన్సర్ నుంచి రక్షిస్తాయి. క్యాన్సర్ రోగులకు డ్రాగన్ ఫ్రూట్ తింటే, వారికి కొంత ఉపశమనం కలిగిస్తుంది.

కొలెస్ట్రాల్ కంట్రోల్ అదుపులో..

డ్రాగన్ ఫ్రూట్ తింటే కొలెస్ట్రాల్ ట్రైగ్లిజరైడ్, చెడు కొలెస్ట్రాల్, లిపోప్రొటీన్ కొలెస్ట్రాల్ తగ్గుతాయి. ఇవి మన శరీరంలో ఎక్కువగా ఉంటే గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ దీని గింజల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి.

ఆర్థరైటిస్ వారికీ మంచిదే..

ఆర్థరైటిస్ నొప్పి ఇన్ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడం వల్ల దీన్ని తింటే ఆర్థరైటిస్ నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఇమ్యూనిటీ పెరుగుతుంది..

డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే విటమిన్ సి, కెరోటినాయిడ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా తెల్ల రక్తకణాలు తినవు. డ్రాగన్ ఫ్రూట్ తింటే ఇన్ఫెక్షన్లు రావు. మెదడుకు కూడా మంచిది. ఆక్సీకరణ ఒత్తిడితో శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో అల్జీమర్స్, పార్కిన్సన్స్, మూర్ఛ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు మెదడు పని తీరు సరిగ్గా లేకపోతే వస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ తింటే మెదడు పనితీరు మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పండించేందుకు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధిపై సిఎంకు సర్పంచు వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట అభివృద్ధిపై సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సర్పంచు కామాటి గురు ఈశ్వర్ వినతిపత్రమిచ్చారు. గండికోటలోని ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి భూమిపూజ చేసే సందర్భంగా ఆదివారం సిఎం గండికోటలకు విచ్చేశారు. ఈ సందర్భంగా సర్పంచు కలెక్టర్ విజయ్‌రామరాజు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సర్పంచు సిఎంతో మాట్లాడుతూ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన గండికోట గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. అయిదు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. 2004లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గండికోటలో సంకల్పించిన ఎకో పార్కు ద్వారా తమ బతుకులు, భవిష్యత్తు మారుతుందని ఆశించామన్నారు. దురదృష్టవశాత్తూ విధివంచనకు గురికావలసి వచ్చిందన్నారు. అనంతరం దశాబ్దకాలం నిరీక్షణ తర్వాత తమరు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి గండికోటను పర్యటకంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంలో అర్హులైన భూ పంపిణీ లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. పంచాయితీలోని ప్రభుత్వ భూములను పర్యాటక శాఖకు అప్పగిస్తున్నారు. తమ గ్రామ ప్రజల అవసరాల కోసం కనీసం 50 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. గ్రామానికి సాగు నీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్, ఇక్కడి ఉద్యోగ ఉపాధి అవకాశాలలో 75 శాతం స్థానికులకే కేటాయించాలని, గతంలో మంజూరు చేసిన పక్కా గృహాలకు ఒన్ టైం సెటిల్మెంటు కింద పరిగణించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తో గండికోట సర్పంచు కామాటి గురు ఈశ్వర్

అధ్వానం.. మార్కెట్ రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ నుండి కడప రోడ్డులోని సాయిబాబా గుడి వరకు గల రోడ్డు, ఈ ప్రాంతంలో ఉన్న కాలనీలు అధ్వానంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అధికంగా సంచార జాతికి చెందిన ప్రజలు, ఎస్సీలు నివాసం ఉంటున్నారు. ఇప్పటికీ ఈ కాలనీలలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారి వెంబడి సిమెంట్ రోడ్డు ఉన్నప్పటికీ దెబ్బతింది. ఎక్కువ చోట్ల ఎత్తుపల్లాలున్నాయి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు, ఆటోలు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ గుంతల్లో నీరు నిలుస్తోంది. అంతేకాకుండా ప్రధాన రోడ్డు వెంబడి డ్రయినేజీ లేకపోవడంతో నీరు అధికంగా సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తున్నది. ఈ రోడ్డు పక్కనే ఉన్న ప్రధాన కాలువలో డ్రయినేజీ నీరు ప్రవహిస్తూ అధ్వానంగా ఉంది. ఈ కాలువను ఆధునీకరణ చేయడంలో మునిసిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వర్షాకాలంలో చెరువు నీరు అధికంగా ప్రవహిస్తూ కాలనీలలో నీరు పారుతుంది. కాలువ వెంబడి ఆక్రమణలు ఎక్కువ. వీటిని పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. సిమెంట్ రోడ్లు వేయాలని, డ్రయినేజీ వ్యవస్థను అభివృద్ధి పరచాలని కాలనీవాసులు పలుమార్లు అడుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నాయకులు మాత్రం ఎన్నికల సమ యంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మున్సిపాలిటీ ఏర్పడి 9 సంవత్సరాలు అయి నప్పటికీ ప్రధాన మార్గమైన రోడ్డును అభివృద్ధి చేయలేదు. ఇప్పటికైనా ప్రత్యేక నిధులను వెచ్చించి మార్కెట్ నుండి కడప రోడ్డు వరకు అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలతోపాటు ఆ దారిన వెళ్లే వారు కోరుతున్నారు.

మురికి, గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డు

హెలికాప్టర్‌లో తిరిగితే ఏం తెలుస్తుంది : పిసిసి

అసంపూర్తిగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో తిరిగితే ఏం తెలుస్తుంది.. రోడ్లపై తిరిగితే వాటి పరిస్థితి తెలుస్తుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి–వేంపల్లె రోడ్డును కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం తులసిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు ప్రగతికి, నాగరికతకు ప్రతి రూపాలన్నారు. వైసిపి పాలనలో గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. సిఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోనే రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటే రాష్ట్రంలో ఎలా ఉంటాయో అర్థమ వుతుందని విమర్శించారు. వేంపల్లె–రాయచోటి రోడ్డు విస్తరణ పనులు మూడేళ్ల కిందట ప్రారంభించారన్నారు. విస్తరణ పేరుతో రోడ్డును తవ్వారని, పనులు మాత్రం పూర్తి చేయలేదన్నారు. దీంతో ప్రయా ణికులు చాలా ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ నాలుకకు మందు వేస్తే అసలు నాలుక ఊడిపోయినట్లు ఉందన్నారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తయ్యేలా సిఎం చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సిఎస్ఐ చర్చికి శిలువ అందజేత

ప్రార్థన చేస్తున్న పాస్టర్ దేవసహాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చికి ఆదివారం సంఘ సభ్యులు ఎల్ఎమ్ కాంపౌండ్‌కు చెందిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ మంగపట్నం కుమార్ కుటుంబం తరపున రూ.30 వేలు విలువ చేసే 7 అడుగుల శిలువ వితరణ చేశారు. సంఘ పాస్టర్ రెవరెండ్ దేవసహాయం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చిపై శిలువ ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఆవు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మన రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా రైతుకు ఒంగోలు జాతి మేలు రకం ఆవును వితరణ చేశారు. ఈ సందర్భంగా మన రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన మహిళా రైతుకు మన ఆర్‌సిడిఎస్ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర కోశాధికారి మంచూరి వెంకటసుబ్బారెడ్డి ఆవును ఉచితంగా అందజేశారు.

ఆవును వితరణ చేస్తున్న మన రెడ్డి కమ్యూనిటీ సభ్యులు

వేసవిలో ఆసరా.. వేప గింజల సేకరణ

కూలీలకు ఉపాధి.. జోరుగా వ్యాపారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వేసవిలో పలువురు కూలీలకు వేపగింజలు ఉపాధినిస్తున్నాయి. వేప గింజలకు మంచి ధర ఉంది. దీంతో పనుల్లేని సమయంలో కూలీలకు ఇవి ఆర్థిక ఆసరాను అందిస్తున్నాయి. ఈ ఏడాది వేపకాయల కాపు అధికంగా ఉంది. వేపకాయల సేకరణ చేసే కూలీలకు వేపచెట్లు ఉపాదినిస్తున్నాయి. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల కూలీలు పనులు లేకపోవడంతో వేపగింజల సేకరణలో నిమగ్న మయ్యారు. ఒక డబ్బా (పది కిలోలు) వేపగింజలు రూ.120 పలుకుతోంది. దీంతో ఆయా గ్రామాల్లోని వేపచెట్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేప గింజల సేకరణ చేస్తున్నారు. అనంతరం పట్టణంలోని పెద్ద పసుపులమోటులోని రెండు కేంద్రాల్లో వాటిని అమ్ముతున్నారు. గతంలో కంటే ఈ ఏడాది అధికంగా కాపు ఉండడం.. దానికి తోడు ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో కూలీలు వేపగింజల సేకరణను వేసవి ఉపాధిగా ఎంచుకున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి దళారులు వేపగింజలను లారీల్లో బయటి ప్రాంతానికి తరలిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, వేపచెక్క తయారీ, వేప నూనెకు ఈ గింజలు వినియోగిస్తారు. అంతేకాక ఆయుర్వేద వైద్య కోసం కూడా తరలిస్తున్నట్లు దళారులు తెలుపుతున్నారు. బెంగుళూరు, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వారు వచ్చి తీసుకెళుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

వేపగింజలను లోడ్ చేస్తున్న కూలీలు

వస్త్ర, మాల్స్ దుకాణాల కార్మికులకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని వస్త్ర, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల్లో, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే కార్మికులకు జీతాలను పెంచాలని సిఐటియు నాయకులు దాసరి విజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జమ్మలమడుగు పట్టణంలోని పలు దుకాణాల్లో 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికుడికి రూ.7000 నుంచి రూ.8000 జీతం ఇచ్చి సరిపెడుతున్నారన్నారు. అన్నారు. సుప్రీం కోర్టు ఆర్డర్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అంతేకాక వారిపై పని భారం తగ్గించి షాప్‌లలో పనిచేస్తున్న కార్మికులందరినీ గుర్తించి కనీసం రోజుకు రూ.500–రూ.600 ప్రకారం నెలవారి జీతంగా రూ.18,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, సిఐటియు ఆటో కార్మికులు స్వామి, రవి, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని అటవీ రేంజ్ అధికారి హేమాంజలి సూచించారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. జెవివి అధ్యక్షులు శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ రోజు రోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని ప్రజలు తమ వంతు బాధ్యతగా తగ్గించాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో తమతోపాటు క్యారీ బ్యాగ్‌ను తీసుకెళ్లాలని ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని తగ్గించాలన్నారు. బయట దొరికే వాటర్ బాటల్స్‌ను కాకుండ తమతో నీళ్లబాటిల్‌ను తీసుకెళ్లాలన్నారు. పర్యావరణదినోత్సవం సందర్భంగా రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న జెవివి సమ్మర్ క్యాంపు విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేశారు. జెవివి కార్యదర్శి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి శాస్త్రీయ ఆలోచన, శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలన్నారు. ప్రతి అంశాన్ని హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా కార్యదర్శి ఉషారాణి, జెవివి నాయకులు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హేమాంజలి

రాజుకు ఆహ్వానం పలుకుతున్న శివయ్య

నూతన కమిటీ చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పివి రావు మాల మహానాడు నూతన కమిటీ చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనం శివయ్య కోరారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగారి ప్రభుదాస్, రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల నాగరాజు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా బోనం శివయ్య మాట్లా డుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి నాయ కుడు పని చేయాలన్నారు. మాలల ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీలో జిల్లా అధ్యక్షులుగా కుందవరం పుష్పరాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా బిర్రు డాని యేలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అతిథిగా రాష్ట్ర దళిత సలహాదారులు మేకల ఆంజనేయులు ప్రసంగించారు. కమిటీ ఎంపిక అనంతరం అంబెడ్కర్ విగ్రహం వద్ద జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కమటం సంజయ్, కెసి పుష్పరాజు, బరిగెల రాజు, రామకృష్ణ, మేసా శివ, బరిగెల చంద్ర, సతీష్, జేస్తాది చంటి, పట్నం ప్రశాంత్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL.,SENIOR CIVIL JUDGE : KADAPA
I.P. No. 32 /2023

T.M.V. Narasimha Rao, S/o. T.Venkateswarlu, Hindu, aged 38 years, residing at D.No. 38/3716-4, Rama Krishna Nagar, Kadapa city, Y.S.R

...Petitioner/petitioner

Vs

1) Duggirala Eswara Rao, S/o. D. Chinna Koteswara Rao, Hindu, aged about 43 years, Painting Master, residing at Ambedkar Nagar, Tangutur Town & Mandal, Prakasam District.
2) Turaka Kondala Rao, S/o. T. Malyadri, Hindu, aged 38 years, Carpenter Master, residing at S.C. Colony, Tangutur Town & Mandal, Prakasam District.
3) Duggirala Perraju, S/o. D. Chinna Koteswara Rao, Hindu, aged about years, Rice Business, residing at Ambedkar Nagar, Puram Centre, Tangutur Town & Mandal, Prakasam District.
4) Undavalli Lakshmi Kanth Pavan, S/o. Venkata Subha Prasad, Hindu, aged about 38 years, Software Employee, residing at D.No. 5-49, Opp: to Chennake-sava Temple, Tangutur Town & Mandal, Prakasam District.
5) Konjeti Manikanta, Father's name not known, Hindu, aged about 29 years, Housing Contractor Supervisor, residing at Sivalayam Vari Street, Tangutur Town & Mandal, Prakasam District.
6) K.P. Thyagaraju, S/o. K.P. Devadanam, Christian, aged about 52 years, working as Teacher in C.S.I. High School, Kadapa. Residing at D.No. 2/150, Maruthi Nagar, Kadapa city & District.
7) M. Pushpa Kumari, D/o. M.D. Rao, Hindu, aged about 42 years, Teacher, residing at D.No. 1/2091, Prakash Nagar, Kadapa city, Y.S.R. District.
8) C.C. Basi Reddy, S/o. C. Narayana Reddy, Hindu, aged about 53 years, Cultivation, residing at D.No. 37/599-4, Nehru Nagar, Kadapa city, Y.S.R. District.
9) Velpula Gangaiah, S/o. Late V. Lakshmaiah, Hindu aged about 59 years, residing at D.No. 97/179-1, near Railway Gate Down, Utukur Village & Post, C.K. Dinne Mandal, Kadapa District.
10) Garrala Had, S/o. Late G. Gangaiah, Hindu, aged about 39 years, residing at Utukur Village & Post, C.K. Dinne Mandal, Kadapa District.
11) K. Lakshumaiah, S/o. K. Ramanna, aged about 55 years, Hindu, Employee, in Medical Department, residing at Durga Temple Back side, Kadapa (town & city) YSR-Kadapa (DO
12) T. Malleswara Reddy, S/o. later Rami Reddy, Hindu, aged about 30 years, Typist (Private), residing at D.No.1/440, Maruthinagar, Kadapa (town & city)

...Respondents

NOTICE

Whereas the petitioner is filed the petition before the Honourable Additional Semior Civil judge, Kadapa and the same is posted for your appearance on **11-07-2023,** your are hereby directed to appear before the Honorable court at 10-30 am in person or through your counsel, otherwise the petition may be decided in your absence.

"BY ORDER OF THE COURT"
SRI. B.VIJAYA KUMAR, B.A.,B.L.
Advacate for the petitioner,
#1/422-1-1-C, Maruthinagar,
Kadapa.